

భగవద్గీత పారాయణంలో ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ శ్రీనివాసశర్మ, భక్తులు

ఆలయంలో భగవద్గీత పారాయణం

చంపాపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో మంగళవారం భక్తులు భగవద్గీత పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మైసూర్ ఆశ్రమ నిర్వాహకులు గణపతి సచ్చితానంద స్వామి, భక్తులు వివిధ ఆలయాల్లో 108 పారాయణాల నిర్వాహనకు గాను 105వ పారాయణం హనుమాన్ ఆలయంలో పూర్తి చేసినట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ పూజలు

చంపాపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ ఆలయాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత దర్శించుకున్నారు. వినాయక, ధ్యానాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు బిల్లకంటి కిరణ్‌కుమార్ గుప్తా, నారగోని శ్రీనివాస్‌యాదవ్, మేక సురేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, బి.ఆనంద్‌కుమార్‌గౌడ్, చీర తిరుమలేష్, మధుసాగర్, మధుసూదన్‌రెడ్డి, చేగోని సురేష్‌గౌడ్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సైదాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలనీ బస్తీలో దళిత సంఘం, సేఫ్ ఫౌండేషన్ లెర్నింగ్ సెంటర్‌లో చదువుకుంటూ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మూడు నుంచి పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, జామిట్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి, ఏంపీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్ రెడ్డి, క్లబ్ సభ్యులు పార్ల్ అలెక్స్, పావని, శ్రీను, చందర్, అల్మాస్, యాసిన్, అనూష, అంజలి తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ జిల్లా బీజేపీ అనుబంధ అధ్యక్షుల నియామకం

సైదాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ జిల్లా బీజేపీ వివిధ మోర్చాల నూతన అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ప్రకటించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా భరత్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మంజులా రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా వై.విజయ్‌కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పాగా రాజేశ్వర్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గోపి నాయక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా సయ్యద్ నిస్సార్ అహ్మద్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి నియమితులయ్యారు.



ఏరియా ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

రోగులకు మెరుగైన వైద్య సేవలు

● బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనీ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి ఎన్జీవోస్ కాలనీలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించడం లేదనీ, వైద్యులు, సిబ్బంది నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారనీ పలువురు కార్పొరేటర్ లచ్చిరెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు మంగళవారం ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కార్పొరేటర్ ఆస్పత్రి సూపరిండెంట్ హరిప్రియతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంతోమంది పేదవారు మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి వస్తున్న తరుణంలో ఇక్కడి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సహించరానిదనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యపు ధోరణితోనే ఎంతో మంది గర్భిణులు, మహిళలు, రోగులు సరైన వైద్యసేవలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం అయితే సహించేది లేదనీ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాండురంగాచారి, శ్రీనివాసు తదితరులు



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు రవీంద్రాచారి, శేఖర్‌రెడ్డి

ధర్మభిక్షం సేవలు చిరస్మరణీయం

ఘనంగా ధర్మభిక్షం వర్ధంతి వేడుకలు

ఎల్బీనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం కార్మిక, కర్షక, విద్యార్థి సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేశారని ప్రజాసమస్యల పరిష్కార సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ అన్నారు. ధర్మభిక్షం వర్ధంతిని సరూర్‌నగర్‌లోని భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మభిక్షం పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు మహబూబ్, రేకల శ్రవణ్‌కుమార్, సంపత్‌కుమార్, మహ్మద్ జాయిద్, ప్రసాద్, రంజిత్, నాగమ్మ, పూలమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై ధర్మభిక్షం విగ్రహం పెట్టాలి

పేదల పాలిట కల్పవృక్షం బొమ్మగాని ధర్మభిక్షం అని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి అన్నారు. ధర్మభిక్షం వర్ధంతిని కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్కర్స్ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను, వీసీకే పార్టీ నాయకులు మచ్చ దేవేందర్, చెరుపల్లి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో...

ధర్మభిక్షం వర్ధంతిని మంగళవారం హయత్‌నగర్ మండల సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి హాజరై ధర్మభిక్షం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ధర్మభిక్షం ఉద్యమాలలో పాల్గొన్నాడని అన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీలో...

అబ్దుల్లాపూర్‌మెట్: బొమ్మగాని ధర్మభిక్షం ప్రజల మనిషి అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. మంగళవారం ధర్మభిక్షం వర్ధంతిని ఆర్‌ఎన్ఆర్ కాలనీలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భూపోరాటం ద్వారా వేలాది ఎకరాలను పేదలకు పంచిపెట్టిన గొప్ప నేత ధర్మభిక్షం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎన్ఆర్ కాలనీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, కేతరాజు నర్సింహ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ సాయినగర్‌లో...

మన్సూరాబాద్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బొమ్మగాని ధర్మభిక్షం చేసిన సేవలు మరువలేనివనీ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చందు కొనియాడారు. ధర్మభిక్షం వర్ధంతి వేడుకలు నాగోల్ డివిజన్ సాయినగర్‌లోని ధర్మభిక్షం భవనంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చందు హాజరై ధర్మభిక్షం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



ఉదయ్‌నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే

చంపాపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నాటికి ఆయా కాలనీలలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులను పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను కోరారు. చంపాపేట డివిజన్‌లోని ఎంఆర్ఆర్‌నగర్ కాలనీ, పద్మానగర్‌కాలనీ, ఉదయ్‌నగర్‌కాలనీ, సూర్యానగర్‌కాలనీలలో మంగళవారం కాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉదయ్‌నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఎన్‌డీపీ పనులు కాలనీల ప్రజల చొరవతో 95 శాతం పూర్తి కావచ్చిందని అన్నారు. సింగిరెడ్డి శివారెడ్డి గార్డెన్ వెనుకలో ఉన్న సూర్యానగర్‌కాలనీలో ఎస్ఎన్‌డీపీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమావేశంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఓరుగంటి వెంకటేష్, సదానంద్‌రెడ్డి, చేగోని మల్లేష్‌గౌడ్, రోజారెడ్డి, శ్రీనాథ్, యాదగిరి, జగదీష్‌గౌడ్ ఆయా కాలనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మామిడి మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

బాటసింగారం మామిడి మార్కెట్‌లో ఫుడ్‌సేఫ్టీ తనిఖీలు

● ఎథలిన్‌తో ప్యాక్ చేసిన 37 బాక్సుల మామిడి సీజ్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఐపీఎం డైరెక్టర్ శివలీల ఆధ్వర్యంలో డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ టి. విజయ్‌కుమార్, ఫుడ్ అనాలసిస్ట్ జీఎల్ఎన్‌రెడ్డి, ఏఎఫ్‌సీ ఎంఏ ఖలీల్ పండ్ల మార్కెట్ సమీపంలోని మామిడి మార్కెట్‌లో అన్ని షెడ్‌లలో ఏక కాలంలో తనిఖీలను నిర్వహించారు. తనిఖీల్లో కుమార్ అగర్వాల్ అనే ఖరీదుదారు ఎక్కువ మోతాదులో ఎథలిన్ ప్యాకెట్లు వేసి మ్యాంగో ప్యాకింగ్ చేయడం అధికారులు గుర్తించారు. వెంటనే అతడి వద్ద ఉన్న 37 బాక్కుల్లో ప్యాక్ చేసిన మామిడిని అధికారులు సీజ్ చేశారు. మామిడి కాయలు త్వరగా మగ్గేందుకు నిషేధిత రసాయన పదార్థాలు వాడితే చట్ట పరమైనా చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. అనంతరం హమాలీలకు ప్యాకింగ్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి చిలుక నర్సింహరెడ్డి, యార్డ్ ఇన్‌చార్జి ఎస్ఏ లాబాన్, సూపర్‌వైజర్ మురళీధర్, డీఓ ధర్మేంద్ర, టి.నాయక్, ఎఫ్ఎస్ఓలు ఉదయ్‌కిరణ్, సునీత, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డను మాకు అప్పగించండి

● వనస్థలిపురం సఖి కేంద్రం వద్ద తల్లిదండ్రుల నిరసన

వనస్థలిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలోని సఖి కేంద్రంలో ఉన్న తమ కూతురిని తమకు అప్పగించాలనీ డిమాండ్ చేస్తు తల్లిదండ్రులు వనస్థలిపురం సఖి కేంద్రం వద్ద మంగళవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్తినాపురంలో నివాసముంటున్న ఓ బాలికకు కొన్ని నెలల క్రితం వివాహం నిశ్చయమైంది. వివాహానికి మూడు రోజుల ముందు పని మీద బయటకు వెళ్తున్నాననీ చెప్పి వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదుతో మీర్‌పేట్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయింది. పోలీసులు దర్యాప్తు చేపట్టగా సూర్యాపేటలో ఆమె ఆచూకీ లభించింది. దీంతో పోలీసులు ఆమెను సూర్యపేటలోని సఖి కేంద్రంలో కౌన్సిలింగ్ ఇచ్చి వనస్థలిపురంలోని సఖి కేంద్రానికి తరలించారు. బాలికకు వారం రోజులుగా వనస్థలిపురంలోని సఖి కేంద్రంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. మంగళవారం సాయంత్రం బాలిక తల్లిదండ్రులు ఫూల్‌సింగ్, చిన్ని తమ కుటుంబ సభ్యులతో కలిసి సఖి కేంద్రంలో ఉన్న తమ కూతురిని కలిసేందుకు తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందుకు సఖి కేంద్ర నిర్వాహకులు మాత్రం అమ్మాయి మేజర్ కావడంతో ఆమెను తల్లిదండ్రులు కలిసేందుకు అవకాశం లేదనీ చెప్పడంతో సఖి కేంద్రం ముందు నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు నిరసన చేపడుతున్న వారికి నచ్చజెప్పి అక్కడనుంచి పంపించేశారు. బాలిక కుటుంబ సభ్యులు మాత్రం సఖి కేంద్రంలో అధికారులు, కొందరు వ్యక్తుల వద్ద డబ్బులు తీసుకుని తమ కూతురు జీవితాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారనీ కన్నీరు మున్నీరుగా విలపించారు.

కాగా ఇటీవల వనస్థలిపురం సఖి కేంద్రంపై పలు మార్లు ఆరోపణలు వస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు మాత్రం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తుండడం, ఈ సెంటర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందనీ పలువురు ఆరోపిస్తున్నారు.



వనస్థలిపురం సఖీ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

బాలాపూర్‌లో 'సనాతన' సందడి

● ప్రవచనాలతో ఆకట్టుకుంటున్న పీఠాధిపతులు

సరూర్‌నగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ ఎస్‌పీఆర్ గార్డెన్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సనాతన వేదాంత జ్ఞాన సభలు రెండో రోజు మంగళవారం సైతం సందడిగా కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులతో ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామిజీలు, మాతాజీలు హాజరయ్యారు. యజ్ఞ మండపంలో వందలాది మంది దంపతులు పాల్గొని వేద పండితుల సమక్షంలో యజ్ఞాలు నిర్వహించారు.



సభలకు హాజరైన పీఠాధిపతులు, మాతాజీలు

ఉచితంగా వైద్య పరీక్షలు

వేసవిలో భక్తుల సౌకర్యార్థం సనాతన సభల ప్రాంగణంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నాగోల్‌లోని నక్షత్ర ఆస్పత్రి వైద్య బృందంతో ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలు విభాగాలకు చెంది వైద్యులు, సిబ్బంది పాల్గొని భక్తులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

పోచమ్మ గుడిని తొలగించొద్దు : కార్పొరేటర్

హయత్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్‌నగర్ లెక్చరర్ కాలనీ ఆంధ్రాబ్యాంకు సమీపంలో ఉన్న పోచమ్మ గుడిని ఆర్అండ్ బీ అధికారులు తొలగిస్తున్నారని కాలనీ వాసులు, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అక్కడికి చేరుకుని అధికారులతో చర్చించారు. తాతల కాలం నుంచి ఉన్న పోచమ్మ ఆలయాన్ని తొలగించొద్దని కార్పొరేటర్ కోరారు. దూరంలో ఉన్న యూ టర్న్‌లతో ఇబ్బందులు కలుగుతున్నాయని, యూటర్న్‌ల వద్ద గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు రఘునందన్ రెడ్డి, వెంకట్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలో నోడల్ ఆఫీసర్ యుగంధర్‌రెడ్డి

ఓటు హక్కుపై అవగాహన అవసరం

● మలక్‌పేట ఎన్నికల నోడల్ అధికారి యుగంధర్‌రెడ్డి

చాదర్‌ఘాట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఓటు మన ప్రాథమిక హక్కు అని, ప్రతి ఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన అవసరమని మలకపేట ఎన్నికల నోడల్ అధికారి యుగంధర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ముసారాంబాగ్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఓటు మన ఆయుధం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు వేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 యూసీడీ విభాగం రిసోర్స్ పర్సన్స్, స్వయం సహాయక గ్రూప్‌ల సభ్యులు, మహిళలు ర్యాలీలో పాల్గొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నినాదాలు చేశారు.

సరూర్‌నగర్ సర్కిల్‌లో 3 విద్యుత్ ఆపరేషన్ సెక్షన్లు

● శివారు సర్కిళ్లలో కొత్త సెక్షన్లపై డిస్కం దృష్టి

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్లకు అనుగుణంగా కొత్త సెక్షన్ల ఏర్పాటుపై విద్యుత్ శాఖ దృష్టిసారించింది. సరూర్‌నగర్ సర్కిల్‌లో కొత్తగా మూడు ఆపరేషన్ సెక్షన్లు ఇంజాపూర్, బడంగ్‌పేట, ఆదిబట్లలో డిస్కం అందుబాటులోకి తెచ్చింది. ఆపరేషన్ సెక్షన్లలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లను ఏర్పాటు చేస్తూ వాటి బాధ్యతలను ఆపరేషన్ ఏఈలకు అప్పగిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ల జారీతో పాటు విద్యుత్‌సరఫరా అంతరాయాల పరిష్కారం ఆపరేషన్ వింగ్ అధికారులకే అప్పగించడంతో సరఫరా అంతరాయాలు కొంతమేర తగ్గించగలిగినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. మార్చి మొదటి వారంలో గ్రేటర్‌జోన్ పరిధిలోని 7 సర్కిళ్ల పరిధిలో కొత్తగా 17 ఆపరేషన్ సెక్షన్లు విద్యుత్‌శాఖ అందుబాటులోకి తెచ్చింది. మెట్రోజోన్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల సర్కిళ్లలోని సెక్షన్ల విభజనపై డిస్కం దృష్టిపెట్టింది.



ఆర్‌కేపురం హనుమాన్ ఆలయ బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే సబితారెడ్డిని జ్ఞాపికతో సత్కరిస్తున్న చైర్మన్ రమేష్ గుప్తా

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

● ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, దేవాలయ చైర్మన్ జగిని రమేష్ గుప్తా, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, జగన్, మహేందర్‌రెడ్డి, ఋషి, యాదవరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లు లేకనే వెనుకబాటు

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో దాదాపు రెండు వేల పోలింగ్ బూత్‌లున్నాయి. ఇందులో దాదాపు 300 నుంచి 500 పోలింగ్ బూత్‌లు బస్తీలు, గల్లీల్లో ఉన్నాయి. అలాంటిచోట్ల బీజేపీ ఇప్పటివరకు ఏజెంట్లను నియమించుకోలేక పోయింది. ఈసారి ఎలాగైనా ఏజెంట్లను నియమించుకోవాలని బీజేపీ కసరత్తు చేస్తోంది. సమర్థులైన కార్యకర్తలను గుర్తించి, వారికి తగిన భరోసా ఇచ్చి ఏజెంట్లుగా పంపాలని ప్రణాళికలో ఉన్నది. గట్టి బందోబస్తు, ఏజెంట్ల నియామకం ద్వారా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో బోగస్ ఓట్లను నిలవరించవచ్చునని బీజేపీ భావిస్తోంది. అంతేకాకుండా, గతంలో తొలగించిన దాదాపు లక్షన్నర మంది ఓట్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్పినట్లు బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఆ ఓట్లు తమకు లాభిస్తాయని భావిస్తున్నారు. ఇంకా దాదాపు నాలుగున్నర లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఒక్కొక్క ఇంట్లో వందల సంఖ్యలో ఓటర్ల పేర్లు ఉన్నాయని, ఖాళీ స్థలాల చిరునామాలో కూడా ఓటర్ల పేర్లు నమోదు అయినట్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఓట్లను అడ్డుకుంటే బీజేపీ లాభిస్తుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఈ దిశగా పార్టీ శ్రేణులు దృష్టి సారించినట్లు చెబుతున్నారు. అలాగే పేద మైనారిటీ వర్గాలను ఆకట్టుకునేందుకు ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మాధవీలత కొంత కాలంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నాయకులు చెబుతున్నారు. పోలింగ్ నాడు బూత్ ఏజెంట్లను పెట్టకపోవడంతో ఓటింగ్ ఇష్టానుసారంగా జరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల ఏజెంట్లపై దృష్టి సారించాలన్న నిర్ణయానికి వచ్చారు.

1980 నుంచి పోరాటం..

1962లో జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి జనసంఘ్ పోటీ చేసింది. 1980లో జనసంఘ్ జనతాపార్టీలో విలీనం కావడంతో ఆలె నరేంద్ర ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1,35,304 ఓట్లు సాధించారు. 1991, 1998, 1999 ఎన్నికల్లో పోటీ చేసిన బద్దం బాల్‌రెడ్డి కూడా ఓడిపోయారు. కానీ, మజ్లి‌స్‌కు గట్టి పోటీ ఇచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందారు. 1991లో ఆయన 42.2 శాతం ఓట్లు సాధించడం విశేషం. 2004 ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి సుబాష్‌చందర్‌జీ పోటీ చేసి 2 లక్షలా 78 వేల ఓట్లు సాధించారు.

2009లో సతీష్ అగర్వాల్ పోటీ చేసినా, కనీస ఓట్లు సాధించలేక పోయారు. అప్పటి నుంచి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాభవం తగ్గుతూ వచ్చింది. 2014లో స్థానికంగా పట్టు ఉన్న భగవంతరావును బరిలోకి దింపడంతో ఆయన గట్టి పోటీ ఇచ్చి దాదాపు 3,11,414 ఓట్లు సాధించారు. ఓడిపోయినా పాతబస్తీలో బీజేపీకి ఆదరణ ఉందని నిరూపించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో భగవంతరావు మళ్లీ పోటీ చేసి ఓడిపోయారు. ఈ లోక్‌సభ స్థానం నుంచి నాలుగు సార్లు కాంగ్రెస్, ఒకసారి తెలంగాణ ప్రజా సమితి విజయం సాధించింది. వరుసగా 12 సార్లు మజ్లిస్ పార్టీయే గెలిచింది. ఆలే నరేంద్ర, బద్దం బాల్‌రెడ్డి వంటి నేతలు మజ్లి‌స్‌కు గట్టి పోటీ ఇచ్చినా మజ్లిస్‌ను నిలువరించి ఎంపీగా గెలవలేకపోయారు.

పూర్వ వైభవం కోసం..

పాతబస్తీలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తూ వచ్చిన బీజేపీ ఇప్పుడు మజ్లి‌స్‌కు దాదాపు సమఉజ్జీగా ఉందని చెప్పాలి. అసెంబ్లీ, పార్లమెంట్, కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలే బలంగా పోటీ పడుతున్నాయి. మజ్లిస్ కంచుకోటను బీటలు కొట్టి మళ్లీ పూర్వవైభవం పొందాలనే ప్రణాళికలో ఈసారి విరించి ఆస్పత్రుల చైర్‌పర్సన్ మాధవీలతకు హైదరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చారు. ఆమె కొంతకాలంగా ధార్మిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల ద్వారా స్థానికంగా పేరొందా రు. టికెట్ ప్రకటించక ముందు నుంచే పాతబస్తీలో హైంద వ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజల ఆలోచనల్లో మార్పు, చైతన్యం తీసుకురావడం ద్వారా వారి మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

సైదాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సైదాబాద్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జల మండలి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డీజీఎం షీలారాణి హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీరు లేకపోతే భూమిపై జీవరాసుల ఉనికే ఉండదని అన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్, శ్రావణ్, ఇన్‌స్పెక్టర్ మనోహర్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రపంచ నీటి దినోత్సవంలో మాట్లాడుతున్న జలమండలి డీజీఎం రాజ్‌గోపాల్

నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు

వనస్థలిపురం, మార్చి 26 (ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇండ్లల్లో నీటి వృథా కాకుండా కాలనీల్లో వాన నీటి సంరక్షణకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని వాటర్ వర్క్స్ డి ప్యూటీ మేనేజర్ రాజగోపాల్ అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనస్థలిపురం ప్రశాంత్ నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్లో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్.ఎం.డబ్ల్యూఎస్ అండ్ ఎస్బీ సహకారంతో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం-6 నీటి సంరణక్ష, వినియోగంపై అవగాహన కల్పిం చారు. భవిష్యత్‌లో నీటి కొరత రాకుండా ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

హయత్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హయత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ డిపోలో హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ సహకారంతో సీడ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, వినియోగంగురించి ఆర్టీసీ కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజగోపాల్ హాజరై మాట్లాడారు. నీటి కొరత రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గృహ యజమానులు తప్పకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్, వాటర్ వర్క్స్ 10 బి. మేనేజర్ వాహిని, శ్రీధర్, లోకేష్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు